మాకెందుకీ వేదన..

- పండుటాకులు, దివ్యాంగుల ఆవేదన
- పేదల పింఛన్లపై రాజకీయాలేమిటని ఆందోళన



చట్టివానిపాలెం సచివాలయంలో పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

గాజువాక : పింఛన్ తీసుకోవడానికి పండుటాకులు అనేక అవస్థలు పడుతున్నారు. అత్యవసరంగా డబ్బులు అవసరమైన వృద్ధులు, దివ్యాంగులు మండుటెండలోనే సచివాలయాలకు వెళ్లి డబ్బులు తెచ్చుకోవాల్సి వస్తోంది. వెళ్లడానికి అవకాశం లేని పరిస్థితుల్లో వేలమంది కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురు చూడాల్సి వస్తోంది.

గాజువాక నియోజకవర్గంలో 26,904 మంది పింఛన్ లబ్ధిదారులున్నారు. వారిలో కిడ్నీ, లివర్ సమస్యలతో బాధపడుతున్నవారు 135 మంది కాగా, దివ్యాంగులు 3645 మంది, వృద్ధులు 12195 మంది ఉన్నారు. మిగిలివారిలో వితంతువులు 8,993 మంది కాగా, ఇతరులు 1936 మంది. వీరందరికీ వార్డు వలంటీర్లు ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులను అందిచేవారు. టీడీపీ అధినేత కుట్ర కారణంగా వలంటీర్లు తమ విధులకు దూరం కావడంతో పింఛన్ లబ్ధిదారులు తమకు రావాల్సిన ప్రభుత్వ సాయం కోసం దిక్కులు చూడాల్సి వచ్చింది. సచివాలయ అడ్మిన్‌లు, సిబ్బంది పింఛన్ల పంపిణీ బాధ్యతను తమ తలకెత్తుకున్నారు. మూడు రోజుల్లో నియోజకవర్గంలో 95.13 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. దీనికోసం తమ సెలవు దినాన్ని కూడా త్యాగం చేశారు. సచివాలయానికి వెళ్లలేని వారు పింఛన్ తీసుకోలేకపోయారు. కిడ్నీ, లివర్ వ్యాధితో బాధపడుతున్నవారు, దివ్యాంగులలో నడవడానికి అవకాశం లేనివారు, వృద్ధులలో అనారోగ్యానికి గురై మంచంపై ఉన్నవారు పింఛన్లు తీసుకోలేకపోయారు. వలంటీర్లు విధులు నిర్వహిస్తున్న సమయంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వచ్చేవారు. ఆ సమయంలో ఎవరైనా ఆస్పత్రులలో ఉంటే అక్కడికి వెళ్లి కూడా పింఛన్లను పంపిణీ చేసిన సందర్భాలు అందరికీ తెలిసిందే. ఈ పరిస్థితుల్లో టీడీపీ అధినేత చేసిన కుట్రపై పింఛన్ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మందులకు డబ్బులు లేవు



నా వయసు 80 ఏళ్లు. మామూలుగానే ఎక్కడికైనా వెళ్లాలంటే చాలా కష్టం. అందులోను కొద్ది రోజులనుంచి ఆరోగ్యం బాగులేక మంచంపైనే ఉన్నాను. వైద్యానికి కూడా చాలా ఖర్చవుతోంది. ఈ నెల ఇప్పటివరకు నాకు పింఛన్ రాలేదు. దీంతో మందులు కొనుక్కోవడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. వెంటనే పింఛన్ డబ్బులు కావాలంటే సచివాలయానికి రమ్మంటున్నారు. నవాబ్‌నగర్‌లోని మా ఇంటినుంచి బీసీ రోడ్‌లోని సచివాలయం కిలోమీటరు దూరంలో ఉంది. అంతదూరం నడిచి వెళ్లగలిగే పరిస్థితి కాదు నాది. సచివాలయానికి నేను వెళ్లలేకపోతే వారు రేపో, ఎల్లుండో వచ్చి డబ్బులు ఇస్తామంటున్నారు. మంచిగా పంపిణీ అవుతున్న పింఛన్లపై చంద్రబాబు ఇంత కుట్ర చేయడం దారుణంగా ఉంది. మాలాంటి వృద్ధులను ఇబ్బంది పెట్టి ఆయన ఏం సాధిస్తాడు. ముసలోళ్లకిచ్చే పింఛన్లపై రాజకీయాలెందుకో నాకు అర్థం కావడంలేదు.

– కర్రి సత్యనారాయణరెడ్డి, నవాబ్‌నగర్, గాజువాక

పింఛన్ కోసం పని మానేసుకున్నాను



నేను దివ్యాంగుడిని. ఎడమ చేయి లేదు. అన్నీ బాగున్నవారికే పని దొరకడం చాలా కష్టం. నాలాంటివాడి పరిస్థితి ఇక చెప్పక్కర్లేదు. అయినా నాపై దయ చూపించి ఒకాయన పని ఇచ్చారు. అది చేసుకుంటూ ప్రభుత్వం నుంచి వస్తున్న పింఛన్‌తో చన్నీళ్లకు వేడినీళ్లు అన్నట్టు జీవిస్తున్నాను. ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్ మా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. దీంతో పింఛన్ తీసేసుకొని నేను పనికి వెళ్లిపోయేవాడిని. ఇప్పుడు చంద్రబాబు నిర్వాకం వల్ల నాకు ఒక రోజు పని పోయింది. సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవడం కోసం సెలవు పెట్టుకోవాల్సి వచ్చింది. వలంటీర్లు పింఛన్ ఇస్తే చంద్రబాబుకు బాధ ఏంటో నాకు అర్థం కావడంలేదు. వలంటీర్లు చెప్తే ఎవరైనా ఓట్లు వేస్తారా? కిందటిసారి ఎవరు చెప్పారని చంద్రబాబు ఓడిపోయారు. దీన్ని ఆయన అర్థం చేసుకోవాలి. పింఛన్ తీసుకునేవారిని ఇబ్బంది పెట్టకుండా ఉంటే బాగుంటుంది.

– జామి నాయుడు, ఎల్‌బీఎస్ నగర్, గాజువాక

ఎండలో రావడం చాలా కష్టమైంది



మాది వడ్లపూడి లక్ష్మీపురం. ప్రతీ నెల 1వ తేదీన వలంటీర్ బాబు ఇంటికి వచ్చి పింఛన్ నగదు ఇచ్చేవారు. మాలాంటి వాళ్ల గురించి ఆలోచించి సీఎం జగన్ వలంటీర్లను పెట్టడంతో మాకు ఇప్పటి వరకు పింఛన్ కష్టాలు లేవు. కానీ ఇప్పుడు వాళ్లు రారని, మీరే సచివాలయానికి వెళ్లి డబ్బులు తెచ్చుకోవాలని చెప్పారు. దీంతో ఎండలో ఎంతో ఇబ్బంది పడి సచివాలయానికి వచ్చాను. పెద్దదాన్ని అయిపోవడంతో, ఆరోగ్యం బాగులేదు. ఎండలు ఎక్కువగా ఉండటంతో చాలా కష్టమనిపించింది. మళ్లీ గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న ఇబ్బందులే ఎదురయ్యాయి. మళ్లీ జగన్‌బాబే రావాలి..మా కష్టాలు తొలగాలని దేవుడిని కోరుకుంటున్నాను.

– అప్పలకొండమ్మ, వడ్లపూడి

పాత రోజులు గుర్తు వచ్చి భయం వేస్తుంది



చంద్రబాబు చేసిన కుట్రకు మాలాంటి పండుటాకులు ఇబ్బందులు పడుతున్నాం. పేదల కష్టాలను తీరుస్తూ గొప్పగా సేవలందిస్తున్న వలంటీర్లను అనవసరంగా ఆపేసి, మాలాంటి వాళ్లకి సమయానికి పింఛన్ రాకుండా చేశారు. ఇప్పుడు గత ప్రభుత్వంలో ఏ విధంగా అయితే ఆఫీసుల చుట్టూ తిరుగుతూ లైనులో నిలబడి పింఛన్ తీసుకునే వాళ్లమో అదే విధంగా చేశారు. ఆ రోజులను తలచుకుంటేనే భయం వేస్తుంది. దేవుడే ఉంటే మాలాంటి పేదల జీవితాల్లో వెలుగులు నింపిన జగన్‌బాబే మళ్లీ సీఎంగా రావాలి. చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పాలి.

– దేవుడు, వడ్లపూడి

అమర్‌నాథ్‌ను ఆదరించి గెలిపించండి

- గాజువాకను మరింత అభివృద్ధి చేస్తారు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్ భార్య హిమగౌరి



మిందిలో ప్రచారం చేస్తున్న అమర్‌నాథ్ భార్య హిమగౌరి

అక్కిరెడ్డిపాలెం: 'అమర్‌నాథ్‌ను ఆదరించి, గెలిపించండి. గాజువాకను మరింత అభివృద్ధి చేస్తారు. ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతారు' అని వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ భార్య హిమగౌరి కోరారు. తన భర్తను గెలిపించాలని కోరుతూ అమర్‌నాథ్ స్వగ్రామం 68వ వార్డు మిందిలో ఆమె ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకమైన గాజువాక నియోజకవర్గానికి అభ్యర్థిగా అమర్‌నాథ్‌ను నిలబెట్టారన్నారు. గాజువాకను మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తారని తెలిపారు. గుడివాడ కుటుంబంతో అనుబంధం ఉన్న అందరూ అమర్ గెలుపు బాధ్యతను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణ, శాంతి కుమారి, అప్పారావు, నారాయణ, రాము, చైతన్య, కోటేశ్వరరావు, దేముడు, నాగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం నేడు


అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను డీసీపీ ఎం.సత్యనారాయణ శనివారం ప్రారంభిస్తారు. సౌత్ సబ్ డివిజన్‌లోని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఫ్యామిలీ వివాదాలకు సంబంధించిన కేసులపై ఈ కేంద్రంలో ప్రతీ శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. కౌన్సెలింగ్‌లో కేసులు పరిష్కారం కాకపోతే, తదుపరి చర్యలకు సిఫార్సు చేస్తారని గాజువాక సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా

'స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ ప్రతిష్ట దెబ్బ తీస్తున్నారు'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ సొసైటీ ప్రతిష్ట దెబ్బ తీస్తున్నారని స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె. ఆనంద్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ తరపున శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గత 38 ఏళ్లుగా సొసైటీ నిజాయితీగా నడుస్తుందని పేర్కొన్నారు. రూ. 390 కోట్లు టర్నోవర్‌తో రాష్ట్రంలోనే ఏ గ్రేడ్ సొసైటీగా పేరు గాంచిందని తెలిపారు. డిపాజిట్లను తిరిగివ్వలేని పరిస్థితిలో సొసైటీ ఉందని, వెంటనే డిపాజిట్లు తీసుకోవాలంటూ కొంతమంది వ్యక్తులు వాట్సాప్‌లలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపై చట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని కోరారు.

వైన్‌షాపులో చోరీ.. నిందితుడు అరెస్ట్



మిత్తిరెడ్డి శ్రీను అలియాస్ దుబాయి శ్రీను

అక్కిరెడ్డిపాలెం : ప్రభుత్వ వైన్‌షాపులో చోరీకి పాల్పడిన నిందితుడిని గాజువాక క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి సుమారు రూ.3,23,000 చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గాజువాక క్రైం ఎస్‌ఐ మహేశ్వరరావు తెలిపిన వివరాలివి.. గాజువాక శ్రీనగర్ రైల్వే గేటుకు వెళ్లే మార్గంలో ఉన్న ప్రభుత్వ వైన్ షాపులో రూ.5,50,580 నగదు చోరీకి గురైనట్లు షాపు సూపర్‌వైజర్ సీతిని గణేష్ ఈ ఏడాది మార్చి 18న గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన గాజువాక పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గాజువాక క్రైం సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటన స్థలంలో సేకరించిన ఆధారాలతో, క్లూస్ టీం సహకారంతో పాత నేరస్తులపై నిఘా ఉంచారు. ఇలాంటి నేరాలకు పాల్పడే మిత్తిరెడ్డి శ్రీను అలియాస్ దుబాయి శ్రీనును పరవాడ మండలంలోని మత్రిపాలెం గ్రామంలో అదుపులోకి తీసుకుని విచారించారు. అతని నుంచి రూ.2,85,000 నగదు, రూ.38,000 విలువైన మొబైల్ (మొత్తం రూ.3,23,000 విలువ గల చోరీ సొత్తు) స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన నిందితుడు ఇప్పటికే పలుమార్లు దొంగతనాలకు పాల్పడి, జైలుకు వెళ్లి బయటికి వచ్చాడని వివరించారు.

స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్‌కు అభినందనలు



డైరెక్టర్ గణేష్‌కు బొకే అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) సిహెచ్.ఎస్.ఆర్.వి. గోపాలకృష్ణ గణేష్‌ను స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు అభినందించారు. నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు శుక్రవారం ఆయనను ఉక్కు పరిపాలన భవనంలో కలిసి శాలువా కప్పి, బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు కార్మికుల పెండింగ్ సమస్యలు వేతన సవరణ, సకాలంలో జీతాల చెల్లింపు తదితర సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, మంత్రి గోపి, ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ. నాయుడు పాల్గొన్నారు.

రూ.7 లక్షల నగదు స్వాధీనం

ఎంవీపీ కాలనీ: ఎన్నికల తనిఖీల్లో భాగంగా ఎంవీపీ పోలీసులు రూ.7 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలి వద్ద ఎస్‌ఐ ఎస్.శ్రీనివాస్, తదితర సిబ్బంది గస్తీ కాస్తున్నారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మజ్జి రమణ అనే వ్యక్తి వద్ద రూ.7 లక్షలు నగదు ఉన్నట్టు గుర్తించారు. ఆ నగదుకు సంబంధించిన సరైన డాక్యుమెంట్స్ లేకపోవడంతో గ్రీవెన్స్ సెల్‌కు నగదును అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ వెల్లడించారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు

ఈఆర్వో లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక : ఎన్నికల కోడ్ నిబంధనలను పక్కాగా అమలు చేసే విధంగా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని గాజువాక నియోజకవర్గం ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి సూచించారు. నియోజకవర్గంలోని వివిధ బృందాలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోడ్ అమలులో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా చిన్న ఉల్లంఘన లేకుండా చూసుకోవాలన్నారు. ఉల్లంఘనలపై అప్రమత్తంగా లేకపోతే ఈసీ చర్యలకు బాధ్యులమవుతామన్నారు. రాజకీయ పార్టీల కార్యకలాపాలు, ప్రచారాలపై విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మోడల్ కోడ్ కఠినంగా అమలు చేయడానికి అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీలు తాము అనుమతి పొందిన సమయం ప్రకారం ప్రచారం చేసుకుటున్నారా, అనమతులను ఉల్లంఘిస్తున్నారా వంటి అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలను తయారు చేయాలని సూచించారు. అనుమతి తీసుకున్న మైక్‌లనే ఉపయోగించాలని, అనుమతి లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేయాలని సూచించారు. ఏ ప్రాంతంలో అనుమతి తీసుకుంటారో ఆ ప్రాంతంలోనే ప్రచారానికి అనుమతించాలని, ఉల్లంఘిస్తే కేసు నమోదు చేయాలని అన్నారు. సమావేశంలో జోన్-2 డీసీపీ ఎం.సత్యనారాయణ, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఐక్య ఉద్యమాలతోనే 'ఉక్కు' పరిరక్షణ



నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎందరో మహనీయుల త్యాగఫలంగా ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ పరం కానివ్వబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఐక్యంగా ఉద్యమించి స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1449వ రోజు, శుక్రవారం.. సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉక్కు పోరాటంలో పాల్గొని పరిశ్రమను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఈ కొబ్బరి చెట్లకు 120 ఏళ్లు



ఆరిలోవ: ముడసర్లోవ పార్కులో ఉన్న కొబ్బరి చెట్ల వయస్సు వింటే ఔరా అంటూ ఆశ్చర్యపోవాల్సిందే. సన్నగా, పొడవుగా గాలికి ఊగుతూ కనిపిస్తున్న ఈ చెట్ల వయస్సు 120 ఏళ్లకు పైగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ముడసర్లోవ పార్కును బ్రిటిష్ అధికారులు 1903లో ఏర్పాటు చేశారు. అప్పట్లో విశాఖ వచ్చిన బ్రిటిష్ అధికారుల కోసం ఇక్కడ గెస్ట్ హౌస్‌లు నిర్మించారు. విశాలమైన ప్రదేశం కావడంతో ఆహ్లాదం కోసం వివిధ రకాల పూల మొక్కలతో పాటు కొబ్బరి, మామిడి, సపోటా తదితర పండ్ల జాతి మొక్కలను కూడా అప్పట్లో నాటారు. అలా 1903లో నాటిన కొబ్బరి మొక్కల్లో ఇప్పటికీ ఈ పార్కులో 10 చెట్లు ఉండడం విశేషం. ఇవి సన్నగా సుమారు 20 నుంచి 25 మీటర్లకు పైగా పొడవు ఉన్నాయి. దీంతో కొబ్బరి కాయలను దించడానికి ఎవరూ ఈ చెట్లే ఎక్కే సాహసం చేయలేకపోతున్నారు.

దళిత బాంధవుడు జగ్జీవన్‌రామ్



టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద జగ్జీవన్‌రామ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు



హరిజన జగ్గయ్యపాలెంలో జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: దళిత జన బాంధవుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెదగంట్యాడలోని ఎస్సీ కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, నాయకులు గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి, రమణారెడ్డి, కాకినాడ అప్పారావు, మంత్రి శంకరనారాయణ, గొందేశి మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో..

స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే నాగిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, పల్లా చినతల్లి, రోజారాణి, రాజాన వెంకటరావు, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, కల్పన, పిట్టా రెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, కులుకూరి మంగరాజు, సంపంగి ఈశ్వరరావు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

జేఎస్ ఫర్ పీపుల్ ఫౌండేషన్ ఫౌండర్ జాగారపు శ్రీను ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని కోరాడ జంక్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించి, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు.



స్టీల్‌ప్లాంట్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు, నాయకులు

భెల్‌లో..

అక్కిరెడ్డిపాలెం: అణగారిన వర్గాల పోరాట యోధుడు బాబూ జగ్జీవన్ రామ్ అని భెల్ (హెచ్‌పీవీపీ) జీఎం (ఓపీఎస్) హెడ్ గౌరీ శంకర్ అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని సంస్థలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. భెల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కొల్లి దేముడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జీఎం (ఇంజినీరింగ్) ఆర్.సి.వి.ఎస్.ప్రసాద్, డీజీఎం (ప్రొడక్షన్) మహాపాత్రో, డీజీఎం మధుసూదన్, సీనియర్ మేనేజర్ జి.చంద్రశేఖర్, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు బొండా బాబూరావు, ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహు, ప్రతినిధులు పాల్గొన్నారు.

➡ 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెంలో జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి గ్రామ అధ్యక్షుడు గుమ్మిడి రామాంజనేయులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పెట్లి అప్పారావు, కె.సన్యాసిరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



భెల్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న గౌరీ శంకర్, ఇతర అధికారులు

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన స్టీల్‌ప్లాంట్ మిల్స్ జీఎం డాక్టర్ ఎం.ఎస్. ప్రసాద్, జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టి.కె.ఎస్.ఆర్.ఠాగూర్ రచించిన జగ్జీవన్‌రామ్ సంక్షిప్త జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తొడన్న, బయ్యే మల్లయ్య, అధికారులు ఠాగూర్, ఎన్.ఎస్.ఆర్.ఎం.ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు వై.మస్తానప్ప, వై.టి.దాస్, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో..

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు పాల్గొని, జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో 86వ వార్డు అధ్యక్షులు వెలుగుల పరశురాముడు,(బాబు), సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ పట్నాయక్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ కేవీ మురళీకృష్ణ



వాహనాల తనిఖీపై సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

సబ్బవరం: వాహనాల తనిఖీల్లో అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర పోలీస్ బలగాలు, జిల్లా పోలీస్ సిబ్బందిని ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై మత్రిపాలెం టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు.వాహనాల తనిఖీలను స్వయంగా పర్యవేక్షించారు.వాహనాల తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలన్నారు.అక్రమ మద్యం,నాటు సారా,గంజాయి రవాణా అరికట్టాలన్నారు.నగదు,ఉచితాల పంపిణీ నిరోధానికి కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐ శంకరావు ఉన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించి పూజకు ఇద్దరు హాజరు కావచ్చు.